నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్ - మేడ్చల్
I | హైదరాబాద్, శుక్రవారం 8 నవంబర్ 2024 | HYDERABAD




సమగ్ర ఇంటింటి సర్వేలో భాగంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి కుటుంబ వివరాలు తీసుకున్న ఎన్యుమరేటర్లు

## కృతుంగలో బొద్దింకలు



సిటీబ్యూరో, నవంబర్ 7 (నమస్తే తెలంగాణ): ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న ఫుడ్ ఎస్టాబ్లిష్‌మెంట్లపై జీహెచ్‌ఎంసీ ఫుడ్ సేఫ్టీ ఉక్కుపాదం మోపుతున్నది. ఆహార నాణ్యతాప్రమాణాలు పాటించని హోటళ్లు, రెస్టారెంట్లు, బార్లతో పాటు సూపర్ మార్కెట్లు, ఐస్ క్రీం పార్లర్లు ఇతర వాటిల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తూ నిబంధనలు ఉల్లంఘించిన వారి పట్ల అధికారులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఇందులో భాగంగానే జీహెచ్‌ఎంసీ ఫుడ్‌సేఫ్టీ అధికారులు గురువారం మూసాపేట కృతుంగ రెస్టారెంట్‌లో తనిఖీలు నిర్వహించారు. వంటగదిలో బొద్దింకలను గుర్తించారు. అపరిశుభ్రమైన వాతావరణంలో వంటగది ఉన్నదని, ఆహార ప్యాకెట్లకు లేబుళ్లు సరిగా లేవని తేల్చారు. మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేదని గుర్తించి చర్యలు తీసుకున్నారు.






# నగర ఖ్యాతిని విస్మరించి

### హెరిటేజ్ కట్టడాలను పట్టించుకోని హెచ్‌ఎండీఏ

**గతంలోనే 12 మెట్ల బావులు, భవనాల పునరుద్ధరణ**

**అభివృద్ధికి నోచుకోని 60కిపైగా పురాతన కట్టడాలు**

**నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న హెచ్‌ఎండీఏ**

**ఘనమైన చరిత్ర కలిగిన హైదరాబాద్ నగరంలో చారిత్రక కట్టడాలు, నిర్మాణాలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. గతంలో వారసత్వ సంపదగా గుర్తించి ఆధునీకరించేందుకు ప్రత్యేక శ్రద్ధ పెట్టిన హెచ్‌ఎండీఏ.. ఇప్పుడు వాటిని విస్మరిస్తున్నది. నగరంలో వందకు పైగా కట్టడాలు, నిర్మాణాలు, భవనాలు, చేద, మెట్ల బావులు ఉండగా, ఇందులో ఇప్పటికే 12 కట్టడాలను హెచ్‌ఎండీఏ గుర్తించి.. ఆధునీకరించింది. అయితే మిగిలిన 60కిపైగా పురాతన కట్టడాల అభివృద్ధిని పక్కన పెట్టేసింది. దీంతో భావితరాలకు చారిత్రక మూలాలను అందించే కట్టడాలు శిథిలావస్థకు చేరుతున్నాయి.**

- సిటీబ్యూరో, నవంబర్ 7 (నమస్తే తెలంగాణ)

### పెండింగ్ పనులూ పూర్తి చేయలేదు..

నిజానికి హైదరాబాద్ వ్యాప్తంగా 100కు పైగా హెరిటేజ్ కట్టడాలు ఉన్నాయి. హైదరాబాద్ పరిధిలో గతంలోనే పలు ప్రాజెక్టుల కింద పలు నిర్మాణాలను అభివృద్ధి చేశారు. ఈ క్రమంలో మరో 60-70కిపైగా కట్టడాలను ఇప్పటికే గుర్తించి నివేదికలు సిద్ధం చేశారు. టూంబ్స్, మినార్లు, చేద, మెట్ల బావులను అభివృద్ధి చేయాల్సి ఉంది. కానీ హెచ్‌ఎండీఏ అధికారులు కానీ, ప్రభుత్వ యంత్రాంగం ఇప్పటివరకు ఆ దిశగా ఒక్క అడుగు వేయలేదు. కనీసం పెండింగ్‌లో ఉన్న పనులను కూడా పూర్తి చేయలేదు.



గుడి మల్కాపూర్‌లోని శివ్‌బాగ్ మెట్ల బావి(ఫైల్)

### పూర్వ వైభవం తీసుకొచ్చిన బీఆర్‌ఎస్ సర్కారు

చారిత్రక కట్టడాలను గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆధునీకరించి..పూర్వ వైభవం తీసుకొచ్చింది. అప్పటి సర్కారు ఆదేశాలతో హెచ్‌ఎండీఏ అధికారులు 12 కట్టడాలు, మెట్ల బావులు, నిర్మాణాలు, భవనాలను ఆధునీకరించారు. గుడిమల్కాపూర్‌లోని శివ్‌బాగ్, భగవాన్‌దాస్ మెట్ల బావులు, లంగర్ హౌజ్‌లోని కటోరా హౌస్, గచ్చిబౌలిలోని మెట్ల బావి, లంగ్ హౌజ్‌లోని ఎంజీ మెమోరియల్ స్టెప్ వెల్, సరూర్ నగర్‌లోని విక్టోరియా మెమోరియల్ హోం, బుద్ధ భవన్ సమీపంలోని సైదానీమా టూంబ్స్ వంటి శిథిలావస్థకు చేరిన నిర్మాణాలను గుర్తించి చర్యలు చేపట్టారు. వీటిని ఆధునీకరించి పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దారు.

## ఎమ్మార్పీ కంటే అధికంగా..

సిటీబ్యూరో, నవంబర్ 7 (నమస్తే తెలంగాణ): ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తున్న ఔషధాలను డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు సీజ్ చేశారు. డీసీఏ అధికారుల కథనం ప్రకారం.. గాజుల రామారం పరిధిలోని అలీప్ ఇండస్ట్రీయల్ ఎస్టేట్‌లో ఉన్న 'మెడ్జిన్ లైఫ్ సైన్సెస్' ఫార్మా కంపెనీ తయారు చేస్తున్న మపిరోసిన్ ఆయింట్‌మెంట్‌ను ఎంఆర్‌పీ కంటే రూ. 30.37కు అధికంగా విక్రయిస్తున్నారు. సమాచారం అందుకున్న డీసీఏ అధికారులు అధిక ధరలకు విక్రయిస్తున్న ఆయింట్‌మెంట్ ట్యూబ్స్‌ను సీజ్ చేసి, తయారీ కంపెనీకి నోటీసులు జారీ చేసినట్లు డీసీఏ డీజీ వీబీ కమలాసన్ రెడ్డి వెల్లడించారు.





నిరసన తెలుపుతున్న స్ట్రీట్ వెండర్స్

## కుమారీ ఆంటీకో న్యాయం.. మాకో న్యాయమా?

### నాలెడ్జ్ సిటీ స్ట్రీట్ వెండర్స్ ఆవేదన

కొండాపూర్: 'ఫుట్‌పాత్‌పై వ్యాపారం చేసుకుంటున్న కుమారీ ఆంటీకో న్యాయం... అదే స్ట్రీట్‌లపై వ్యాపారం చేసుకుంటున్న మాకో న్యాయమా' అంటూ నాలెడ్జ్ సిటీలోని ఫుట్‌పాత్‌లపై వ్యాపారం చేసుకుంటున్న స్ట్రీట్ వెండర్స్ ఆందోళనకు దిగారు. ఎలాంటి సమాచారమివ్వకుండా టీఎస్‌ఐఐఎస్, ట్రాఫిక్ పోలీసులు దౌర్జన్యంగా తమ స్టాళ్లను తొలగించడంతో గురువారం నిరసన తెలిపారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా సాఫ్ట్‌వేర్ సంస్థలకు దూరంగా బతుకుదెరువు కోసం స్టాల్స్ ఏర్పాటు చేసుకొని ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా వ్యాపారం చేసుకుంటున్న తమపై దౌర్జన్యం చేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలంటూ ఆందోళన చేపట్టారు. ట్రాఫిక్ ఇబ్బందులు కలిగేలా, అత్యవసర సమయంలో కనీసం అంబులెన్స్‌లు సైతం వెళ్లలేని పరిస్థితిని కల్పిస్తున్న కుమారీ ఆంటీ స్టాల్ వైపు మాత్రం కన్నెత్తి చూడని అధికారులు.. తమపై చర్యలు తీసుకోవడం ఎంతవరకు సమంజసమంటూ ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఫుట్‌పాత్ స్టాల్స్ వైపు వెళ్లవద్దని, వాళ్ల వ్యాపారాలకు ఇబ్బందులు కలిగించొద్దని చెప్పినా.. టీజీఐఐఎస్ అధికారులు కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారంటూ ఆరోపించారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి స్టాల్స్ నడుపుతున్న వారిపై చూడని అధికారులు, స్థానికులమైన తమపై కక్షపూరితంగా వ్యవహరించడం వెనకాల కారణాలేమింటో తెలుపాలన్నారు. స్టాల్స్ తొలగింపుతో వాటిపై ఆధారపడి జీవిస్తున్న 100 కుటుంబాలు రోడ్డున పడ్డాయంటూ ఆవేదన వ్యక్తం చేశారు.


